క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



స్విమ్స్‌లో సెల్వంను పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండడంతో వారి వెన్నంటే ఉంటామని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. మండలంలోని కీళగరం ఎంపీటీసీ సభ్యుడు రవి సోదరుడు, పార్టీ నాయకుడు సెల్వం(54) అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్‌లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసి రాజేష్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సెల్వం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

9 గంటలకే గ్రీవెన్స్

నారాయణవనం: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే(ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను ఉదయం 9 గంటలకే ప్రారంభవుతుందని తహసీల్దార్ జయరాములు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ సోమవారం నుంచి ఉదయం 10 గంటలకు కాకుండా 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆయన తెలిపారు. ఈ మార్పును ప్రజలంతా గమనించాలని ఆయన కోరారు.

ఆగమోక్తంగా సంకట చతుర్థశి పూజలు



హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద మంగళవారం ఆగమోక్తంగా సంకట చతుర్థశి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా ఈ పూజలను ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం బీజేపీ అధ్యక్షుడిగా అయ్యప్పన్



నాగలాపురం: భారతీయ జనతా పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా అయ్యప్పన్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం నుంచి మంగళవారం ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా అయ్యప్పన్ మాట్లాడుతూ తనను నమ్మి తనకు ఈ అవకాశం కల్పించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనకు బీజేపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలను అతిక్రమించవద్దు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: పట్టణంలోని తుపాన్ సెంటర్‌లో నివసిస్తున్న ప్రజలకు 1వ పట్టణ సీఐ గోపి చట్టాలపై అవగాహన కల్పించారు. సోమ వారం రాత్రి తుపాన్ సెంటర్‌లో సీఐ గోపి ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ చట్టాలను అతిక్రమించకూడదన్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం



శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని ఎంజీఎం హోటల్ వెనుక ఓ గుర్తు తెలియని మహిళ (50) మృతదేహం ఉండడాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. ఒకటో పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. ఎంజీఎం హోటల్ వెనుక ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాల కోసం ఆరా తీశారు. వివరాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఆనవాళ్లు తెలిసిన వారు ఒకటో పట్టణపోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

చదువులకు సర్కారు గ్రహణం

- నాబార్డు పనులు ఎప్పటికి పూర్తయ్యేనో ?
- వరదయ్యపాళెం, గోవర్ధనపురం హైస్కూళ్లల్లో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు
- చాలీచాలని గదుల్లో విద్యార్థుల అవస్థలు



గోవర్ధనపురం హైస్కూల్‌లో నిర్మాణ దశలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల భవనం



వరదయ్యపాళెం హైస్కూల్‌లో నిర్మాణ దశలో ఆగిపోయిన భవనం

వరదయ్యపాళెం మండలంలోని గోవర్ధనపురం, వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత ప్రభుత్వంలో మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో చాలీచాలని తరగతి గదుల్లో పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాబార్డు నిధుల ద్వారా వరదయ్యపాళెం హైస్కూల్‌కు రూ.1.20 కోట్లు, గోవర్ధనపురం హైస్కూల్‌కు రూ.80 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ ద్వారా పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రెండు చోట్ల కూడా భవనాలకు శ్లాబు దశ వరకు పూర్తయ్యాయి. గదులకు అరుగు, ఇతర చిన్నపాటి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు ఉద్దేశ పూర్వకంగా నిధులు మంజూరు చేయకుండా అడ్డంకులు చేస్తుండడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపేశాడు. దీంతో 80 శాతం పనులు పూర్తయినప్పటికీ సంబంధిత భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఆగిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు భవనాలను అందుబాటులోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - వరదయ్యపాళెం

ఆలయ అధికారులపై కేసు వేస్తా



ఆలయ అధికారులు తొలగించిన మెట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా అతిథి గృహం యజమాని లక్ష్మయ్యనాయుడు తన భవనానికి అధికారులు నష్టపరిహారం ఇవ్వడం లేదని.. అంతవరకు తన భవనాన్ని తొలగించకూడదని కోర్టులో స్టే తెచ్చుకున్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2018 నుంచి స్టే ఉన్నప్పటికీ ఆలయ అధికారులు తమ అతిథి గృహం మెట్లను తొలగించారన్నారు. వారిపై కోర్టు ధిక్కార కేసు వేస్తానని తెలిపారు.

నేత రంగానికి మహర్దశ

నారాయణవనం: రాష్ట్రంలోని చేనేత, మరమగ్గ రంగాలకు మహర్దశ ప్రారంభమైందని నారాయణవనం మండల టీడీపీ అధ్యక్షుడు గిరిబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం నారాయణవనంలో మరమగ్గ, చేనేత కార్మికులు, పార్టీ శ్రేణులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మరమగ్గాలకు 500 యూనిట్లు, చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్రమంత్రి మండలి ఆమోదం తెలిపింది. పెరిగిన కూలీలు, ముడి సరుకుల ధరలతో భారమై, పనిలేని నేతన్నలకు ఉచిత విద్యుత్ ఎంతో ఊరటనిస్తుందని గిరిబాబు అన్నారు. మరమగ్గ, చేనేత కార్మికులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేని కలిసిన నాయకులు



నూతనంగా పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు

ఏర్పేడు (రేణిగుంట): నూతనంగా పదవులు పొందిన వైఎస్సార్‌సీపీ ఏర్పేడు మండల నాయకులు శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏర్పేడు మండలానికి చెందిన శ్రీకాళహస్తి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎస్.శివయ్య, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడు జి.బత్తిశెట్టి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టి.రామమూర్తి, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా ఎ.అయోధ్య ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వారిని ఘనంగా సత్కరించారు. ప్రజల సమస్యలపై పోరాడాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య, మాజీ మండల ఇన్‌చార్జ్ కిషోర్ రెడ్డి, కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ నాగార్జున రెడ్డి, నాయకులు గంజి రవియాదవ్, రాజశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీమంతుల రామయ్య చారి, సోషల్ మీడియా ప్రతినిధి కేశవులురెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొత్తపేటకు చెందిన వరుగు మునిశేఖర్‌రెడ్డి మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే విధంగా తొట్టంబేడు మండలం రాంబట్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంతమ్మ, శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగకు చెందిన పొలంరెడ్డి కమలమ్మ కూడా మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, కంచనపల్లి శ్రీరాములురెడ్డి, మునిరెడ్డి, అమ్మపాళెం చిట్టి, షేక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

1200 ఓట్లు దాటితే బైఫర్‌కేషన్



మాట్లాడుతున్న ఎలక్టోరిటర్నింగ్ అధికారి రోస్‌మాండ్

సత్యవేడు: పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్ల సంఖ్య 1200 దాటితే బైఫర్‌కేషన్ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు తిరుపతి జిల్లా నియోజక వర్గం ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి, భూ సంరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రోస్‌మాండ్ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాలు వివరాలపై వివిధ రాజకీయపార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో ప్రస్తుతం 1200 దాటినవి బుచ్చినాయుడుకండ్రిగ మండలం వెస్టు వరవత్తూరు, వరదయ్యపాళెం మండలంలో శీలంపల్లి గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. అఖిలపక్షం సభ్యులు శ్రీధర్(వైఎస్సార్‌సీపీ), సీపీఎం నాయకుడు రమేష్ , బీజేపీ నాయకుడు బి.మోహన్ బాబు, తహసీల్దార్లు టీవీ సుబ్రమణ్యం, రాజశేఖర్, డీటీ త్యాగరాజ్, మాధురి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యాంప్రసాద్ రెడ్డి, మునికృష్ణయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ చాంబర్ ముట్టడి



తహసీల్దార్ చాంబర్ వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దార్ చాంబర్‌ను మండలంలోని కనమనంబేడు దళితులు ముట్టడించారు. తమ స్వాధీనంలో ఉన్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కనమనంబేడు దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఏడో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా వారు తహసీల్దార్ చాంబర్ ముట్టడించారు. తహసీల్దార్ చాంబర్ ముందు కూర్చొని నిరసన తెలిపారు. సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి బుచ్చినాయుడుకండ్రిగకు భూసమస్య నిమిత్తం వచ్చి దీక్ష శిబిరానికి వస్తానని చెప్పి రాకపోవడంపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, మణి, గోయల్‌బాబు, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● సర్కారు కార్యాలయంలోనే సిట్టింగ్



నాగలాపురంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతి రోజూ రాత్రి అయితే చాలు మందుబాబులు ఎంచక్కా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సిట్టింగ్ వేస్తున్నారు. దీంతో ఉదయాన్నే వెళ్లి చూస్తే కార్యాలయ ఆవరణమంతా ఖాళీ మందు బాటిళ్లు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, డిస్పోజల్ గ్లాసులు దర్శనమిస్తున్నాయి. మద్యం తాగేసి ఖాళీ బాటిళ్లను, తినుబండారాలను అక్కడే వదిలేసి వెళ్తుండడంతో ఉదయాన్నే కార్యాలయానికి వచ్చే సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే అర్జీదారులు సైతం ముక్కు మూసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. - నాగలాపురం

అంతరాయం కలిగించవద్దు



అవగాహన కల్పిస్తున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై వాహనాలను నిలపటం వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వాహనాలను నిలపకూడదని సీఐ తిమ్మయ్య తెలిపారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డుపై నిలిపిన వాహనాదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు మెయిన్‌రోడ్డులో అడ్డదిడ్డంగా పెట్టుతున్నారని, దీనివల్ల షాపు యాజమానులు, లారీ, బస్సుల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆటోవాలాలు ఆటోలను ఎక్కడపడితే అక్కడ పెట్టకూడదన్నారు. షాపుల వద్దకు సరుకులకు వస్తున్న ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై పెట్టకూడదని తెలిపారు. వాహనదారులు వాహనాలను మెయిన్‌రోడ్డులో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథనాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆదేశంతో కేసు నమోదు



బాధితున్ని పరామర్శిస్తున్న యానాది సంఘ నేతలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం మల్లవరం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై డీఎస్పీ ఆదేశాలతో ఎట్టకేలకు కేసు నమోదైంది. బాధితుల కథనం మేరకు.. క్రిష్టాపురం యానాది కాలనీ చెందిన ప్రకాష్, సుబ్రహ్మణ్యం కూలి పనులకు వెళ్లి సాయంత్రం బైక్‌లో ఇంటికి బయలుదేరారు. రేణిగుంట మండలం మల్లవరం హైస్కూల్ వద్ద అతివేగంగా వచ్చిన కారు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ప్రకాష్, సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి సిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేయడంలో రేణిగుంట పోలీసులు అలసత్వం వహించడంతో బాధితులు ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం ఆధ్వర్యంలో రేణిగుంట డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బోర్డు'కు చట్టభద్రత అవసరం

తిరుపతి కల్చరల్ : ఆంధ్ర బోర్డు ఫర్ ఆయుర్వేదకు చట్టభద్రత అవసరమని ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.రాజేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆయుర్వేద కౌన్సిల్ బిల్లు ఆమోదం, గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఈ బిల్లును అసెంబ్లీలో, శాసన మండలిలో ప్రవేశ పెట్టడం సంతోషకరమన్నారు.

పరీక్షల వేళ విద్యుత్ అంతరాయం



చిమ్మ చీకట్లో దొడ్లమిట్ట గ్రామం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): విద్యార్థులకు ఎంతో ముఖ్యమైన పదో తరగతి పరీక్షల సమయంలో గ్రామాల్లో విద్యుత్ అంతరాయంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ, మామండూరు పంచాయతీల్లో మంగళవారం రాత్రి 6.30 గంటల నుంచి కరెంటు సరఫరా లేకపోవడంతో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు చిమ్మ చీకటిలో గడుపుతున్నారు. కరకంబాడి పంచాయతీ గొల్లపల్లి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన సమస్యతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఏఈ, లైన్‌మన్, సిబ్బంది అంతా గ్రామంలోనే ఉండి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని డీఈ రమేష్ తెలిపారు.

మగువా.. చూపించు నీ తెగువ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న బాలికలకు స్వీయరక్షణలో భాగంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇస్తున్నట్లు హెచ్ఎం రూపేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో బాలికల్లో కరాటే మాస్టర్ కన్నయ్య శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం నింపడం కోసం పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పథకంలో భాగంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. బాలికలకు స్వీయరక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసంతో పాటు బాలికలకు భద్రత, ధైర్యవంతులుగా తయారు చేయడానికి పోకిరీలు, ఆకతాయిల నుంచి స్వీయరక్షణ పొందడానికి కరాటే శిక్షణ ఎంతో ఉపయోగమని తెలిపారు. వేధింపుల నుంచి తట్టుకుని ఎవరికి వారు రక్షకులుగా మారడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని, పిల్లలంతా చక్కగా నేర్చుకుంటున్నారని తెలిపారు.



బాలికలకు స్వీయ రక్షణలో శిక్షణ ఇస్తున్న కన్నయ్య

వెట్టి చాకిరి నేరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ నేరమని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోప్స్ సేవా సంస్థ రూపొందించిన వెట్టి చాకిరీ నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వెట్టి చాకిరీ అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించాలని కోరారు.
పనికితగ్గ వేతనం ఉండాలని, ఆ దిశగా రోప్స్ సంస్థ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధ్యతగా వేద పరిరక్షణ



మాట్లాడుతున్న ముక్తేశ్వరరావు

తిరుపతి సిటీ : వేద పరిరక్షణను విద్యార్థులు బాధ్యతగా భావించాలని టీటీడీ మాజీ జేఈఓ ఎస్ ముక్తేశ్వరావు పిలుపునిచ్చారు. ఎస్వీ వేదిక్ వర్సిటీ, ఉజ్జయిని మహర్షి సందీపని వేద విద్యా ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత క్షేత్రీయ వేద సమ్మేళనంలో భాగంగా రెండోవరోజు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వేదాల్లోని అర్థాలను భావితరాలను అందించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో కంచి చంద్రశేఖరేంద్ర వర్సిటీ వీసీ శ్రీనివాస్, వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు, ఆచార్య విరూపాక్ష జడ్డీపాల్, నృత్య కళాశాల అధ్యాపకుడు హరినాథ్ పాల్గొన్నారు.

దుకాణాన్ని తగలబెట్టేందుకు యత్నించగా..



పాట్నా యువకుడు

శ్రీకాళహస్తి: పాట్నాకు చెందిన సోనా అనే యువకుడు సోమవారం అర్ధరాత్రి ఆలయ సమీపంలోని రామాలయం పక్కన ఉన్న ఓ దుకాణాన్ని తగలబెట్టేందుకు యత్నించాడు. అయితే చుట్టుపక్కల ఉన్న భక్తులు గుర్తించి అతనికి దేహశుద్ధి చేశారు. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది అతన్ని పట్టుకుని వివరాలు ఆరా తీశారు. తాను పాట్నాకు చెందిన వాడని, పని కోసం వచ్చినట్లు చెప్పాడు. అయితే ఎందుకు తగులబెట్టేందుకు చూశాని ప్రశ్నించగా అతని నుంచి సరైన సమాధానం రాలేదు. అతన్ని ఆలయ సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. అతని మానసిక పరిస్థితి బాగలేదా ? లేకుండా ఏదైనా కారణం ఉందా ?అనేది వెల్లడి కావాల్సి ఉంది.

అధికారుల స్పందన

శ్రీకాళహస్తి: 'సమయం సర్దుబాటు చేయండి సారూ' అని సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పాఠశాలలకు హాజరు కావాలని మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1.30 గంటకు స్కూల్‌కు హాజరు కావాలని ఎంఈఓ భువనేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.